# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 91 | గురువారం 04, డిసెంబర్ 2025 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com


# ఖమ్మం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

## డివైడర్‌ను ఢీకొట్టిన కారు
## ముగ్గురు యువకుల దుర్మరణం
## అతివేగమే ప్రమాదానికి కారణమా?



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**
ఖమ్మం జిల్లాలో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామం సమీపంలో వెళ్తుండగా ఓ కారు వేగం అధికంగా ఉండటంతో ఒక్కసారిగా అదుపు తప్పి రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఢీకొట్టిన తీవ్రతకు కారు ముందుభాగం పూర్తిగా దెబ్బతింది.ప్రమాదం సమయంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు అక్కడికక్కడే మరణించారు. స్థానికులు ఘటనను ..మిగతా 3లో

# కోకాపేటలో ఎకరం రూ.131 కోట్లు

**ఒక్కరోజులోనే ప్రభుత్వానికి వెయ్యి కోట్ల ఆదాయం**
**త్వరలో మరింత ప్రభుత్వ భూమి వేలం**
**రోజురోజుకు పెరుగుతున్న భూముల ధరలు**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**
కోకాపేట నియోపోలిస్ భూములపై పెట్టుబడిదారుల ఆసక్తి కొనసాగుతోంది. హెచ్‌ఎండీఏ నిర్వహిస్తున్న ఈవేలాల్లో వరుసగా రికార్డు స్థాయి ధరలు నమోదవుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం నిర్వహించిన మూడో విడత ఈవేలం కూడా భారీ పోటీతత్వం మధ్య విజయవంతంగా ముగిసింది. ప్లాట్ నెంబర్ 19, 20లకు కలిపి 8.04 ఎకరాల భూమిని వేలం వేయగా, అంచనాలకు మించి భారీ బిడ్లు వచ్చాయి. అధికారుల వివరాల ప్రకారం ప్లాట్ నెంబర్ 19లో ఎకరానికి రూ.131 కోట్లు, ప్లాట్ నెంబర్ 20లో ఎకరానికి రూ.118 కోట్లు ధర పలికింది. ఈ రెండు ప్లాట్ల విక్రయం ద్వారా ఒక్కరోజులోనే హెచ్‌ఎండీఏకు దాదాపు రూ. వెయ్యి కోట్ల మేర ఆదాయం లభించింది. వేలంలో పాల్గొనే సంస్థలు, డెవలపర్లు పెద్ద సంఖ్యలో ..మిగతా 2లో

## కేటీఆర్ ఇక్కడ రాజకీయం చెయ్

**రేవంత్ రెడ్డి సహా మేం సిద్ధం**
**రాహుల్ గాంధీని విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరిక**
**రాహుల్ గాంధీది త్యాగాల కుటుంబమన్న జగ్గారెడ్డి**
**కేసీఆర్ కుటుంబం ఉద్యమం సమయంలో రాజకీయం చేసిందని విమర్శ**



02

## బీడీ, చుట్ట కార్మికులకు భరోసా..

**బీడీ, చుట్ట కార్మికులకు వర్తించనున్న కొత్త కార్మిక చట్టాలు**
**రోజువారీ పని గంటలు 8కి తగ్గింపు..వారానికి 48 గంటల పరిమితి**
**ఓవర్ టైమ్ చేస్తే రెట్టింపు వేతనం చెల్లించడం తప్పనిసరి**
**అందరికీ కనీస వేతన హామీ..వలసల నివారణకు ఫ్లోర్ వేజ్ విధానం**

02



# అంతా తప్పుడు ప్రచారం

## నా వ్యాఖ్యలు కట్ చేసి ఎడిట్ చేశారు

**అంతర్గత వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేస్తారా?**
**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీకి డిపాజిట్ పోయింది**
**ఆ అక్కసుతోనే ఈ తప్పుడు ప్రచారానికి ఒడిగట్టారు**
**రాష్ట్రంలో పదేండ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుంది**
**ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, ప్రజాస్వరం:**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో పలు ముఖ్య సమావేశాలతో బిజీగా గడిపారు. జాతీయ నేతలతో భేటీలు, కేంద్ర మంత్రులతో చర్చలు, పార్టీ వ్యవహారాలపై సమీక్షలు నిర్వహించిన అనంతరం నేషనల్ మీడియాతో ఆయన మాట్లాడారు. ఇటీవల హిందూ దేవుళ్లపై తాను చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో, వాటిపై స్పష్టతనిచ్చే అవకాశం తీసుకున్నారు. తాను కాంగ్రెస్ పార్టీ అంతర్గత సమావేశంలో నాయకులకు చెప్పిన సూచనల్లోని కొన్ని మాటలను ముందు-వెనక కట్ చేసి సోషల్ మీడియాలో వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని రేవంత్‌రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తాను చెప్పిన అసలు సందర్భాన్ని పూర్తిగా పక్కన పెట్టి, మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టేలా కృత్రిమ వివాదం సృష్టిస్తున్నారని ఆరోపించారు.

**పదేళ్లు తెలంగాణలో మా పాలనే**
తెలంగాణ ప్రజలు తన నాయకత్వంపై నమ్మకం ఉంచారని, రాబోయే దశాబ్దం పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే కొనసాగుతుందనే విశ్వాసం తనకు ఉందని స్పష్టం చేశారు. ఉత్తర భారతదేశంలో కూడా తన ప్రజాదరణ పెరుగుతుండటంపై సంతోషం వ్యక్తం చేసిన రేవంత్, ఇది తెలంగాణ ప్రభుత్వము ప్రజల కోసం చేస్తున్న పనులకు లభిస్తున్న గౌరవమని అన్నారు. తాను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులకు ఇచ్చిన ఉపన్యాసం ఉద్దేశపూర్వకంగా తప్పుగా మిగతా 2లో..

## గ్లోబల్ సమ్మిట్‌కు రండి

ప్రధాని మోడీకి సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానం
8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్
రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీకి కూడా రేవంత్ ఇన్విటేషన్

02

# సంచార్ సాథీ తప్పనిసరి కాదు

**నిర్ణయాన్ని ఉపసంహరించుకున్న టెలికాం విభాగం**
**యాప్ కు భారీగా పెరిగిన డౌన్ లోడ్స్**
**ఒక్కరోజులోనే ఆరు లక్షల మంది ఇన్ స్టాల్**
**ఈ యాప్ పై ప్రతిపక్షాల విమర్శలు**
**వ్యక్తిగత డాటా తస్కరిస్తారంటూ ఆరోపణలు**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**
కొత్తగా విడుదలయ్యే సెల్‌ఫోన్లలో సంచార్ సాథీ యాప్‌ను ముందుగా ఇన్‌స్టాల్ చేయాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇటీవల జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించుకుంటున్నట్లు టెలికాం విభాగం బుధవారం అధికారికంగా ప్రకటించింది. దీంతో ఈ యాప్ ఇన్‌స్టలేషన్ పూర్తిగా ఐచ్ఛికంగా మారింది. సైబర్ నేరాలను అరికట్టడం, ఫోన్ మోసాల నుండి ప్రజలను రక్షించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం గతంలో సంచార్ సాథీ యాప్‌ను తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయం వెలువడిన వెంటనే విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ప్రజల వ్యక్తిగత గోప్యత ఉల్లంఘనకు గురయ్యే అవకాశం ఉందని, ఎవరితో సంప్రదించకుండా ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం తీసుకుందనే విమర్శలు వినిపించాయి. ఈ నేపథ్యంలో పరిస్థితిని సమీక్షించిన కేంద్రం, ముందస్తు ఇన్‌స్టలేషన్ నిర్ణయం అవసరం లేదని ..మిగతా 2లో



# రేవంత్ రెడ్డి హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలి

**హిందూ దేవుళ్లను అవమానించడమే కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుందని విమర్శ**
**రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను గాయపరిచేలా ఉన్నాయని వ్యాఖ్య**
**హిందుగాళ్లు, బొందుగాళ్లు అంటే ప్రజలు ఏ రకమైన తీర్పు ఇచ్చారో గుర్తుంచుకోండని హితవు**



02

# సీఎం రేవంత్ రెడ్డిపై ఈసీకి కవిత ఫిర్యాదు

**కోడ్ ఉల్లంఘిస్తున్నారంటూ ఆరోపణ**
**ప్రభుత్వ కార్యక్రమాల్లో సర్పంచ్ ఎన్నికల ప్రచారం చేస్తున్నారంటూ లేఖ**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**
రాష్ట్రంలోని పంచాయితీ ఎన్నికల కోడ్ ఉల్లంఘన విషయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రచారంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. కవిత లేఖలో పేర్కొన్నట్టు, సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాధనాన్ని వినియోగించి పంచాయితీ ఎన్నికల ప్రచారం చేస్తున్నారని, దీన్ని వెంటనే ఆపాలని, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా నియంత్రించాలని ఆమె తెలంగాణ ఎన్నికల కమిషన్‌కు సూచించారు. లేఖలో కవిత వివరించారు, మక్తల్, కొత్తగూడెం సభల్లో సర్పంచులుగా మంత్రులు, ఎమ్మెల్యేల సన్నిహితంగా పని చేయించే ..మిగతా 2లో



## సీఎం రేవంత్ రెడ్డిపై ఈసీకి
# కవిత ఫిర్యాదు

**మొదటిపేజీ తరువాయి**

వారిని గెలిపించాలని ప్రయత్నించటం ద్వారా సీఎం ఎన్నికల కోడ్ ఉల్లంఘన చేశారని. ఈ ఫిర్యాదును తెలంగాణ జాగృతి ఇప్పటికే ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు, నవంబర్ 30వ తేదీన లిఖిత పూర్వకంగా ఫిర్యాదు సమర్పించామని ఆమె గుర్తు చేశారు.

**పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై విమర్శలు**

ఇంకా, సినీ నటుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చిన వ్యాఖ్యలపై కూడా కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ "తెలంగాణ నాయకుల దృష్టితో కోనసీమ పాడైందని" చెప్పిన వ్యాఖ్యల నేపథ్యంలో కవిత తెలిపింది, తెలంగాణ ప్రజలు ఎప్పుడూ ఏకైక దిష్టి పెట్టలేదని. కోనసీమ మాదిరిగా కాకుండా, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా స్థాపించుకోవాలని కోరుకున్నాం అని గుర్తు చేశారు. ఉద్యమంలో బిడ్డలు ప్రాణాలను త్యాగం చేశారని, శ్రీకాంతాచారి వంటి ఉద్యమకారుల త్యాగాన్ని మాటల్లో కొలవలేమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉద్యమకారులను గౌరవించాల్సిన బాధ్యత వహించలేదని, గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ అమరవీరులను తగిన విధంగా గౌరవించలేదని విమర్శించారు. కవిత సాధన 12 సంవత్సరాలుగా ఉన్నప్పటికీ, ప్రజలకు నిజమైన గౌరవం ఇవ్వలేదని, రాష్ట్రంలోని సాధనార్ధులు మర్యాద పొందలేదని స్పష్టత చేశారు.



## రేవంత్ రెడ్డి హిందూ సమాజానికి
# క్షమాపణలు చెప్పాలి

- హిందూ దేవుళ్లను అవమానించడమే కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుందని విమర్శ
- రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను గాయపరిచేలా ఉన్నాయని వ్యాఖ్య
- హిందుగాళ్లు, బొందుగాళ్లు అంటే ప్రజలు ఏ రకమైన తీర్పు ఇచ్చారో గుర్తుంచుకోండని హితవు



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

కాంగ్రెస్ పార్టీ హిందువులను, హిందూ దేవుళ్లను అవమానించడమే ధ్యేయంగా పెట్టుకున్నట్లు ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ దేవుళ్లను అవమానించేలా మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ సమాజానికి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలు గాయపరిచేలా ఉన్నాయని అన్నారు. గతంలో కేసీఆర్ హిందుగాళ్లు, బొందుగాళ్లు అంటే ప్రజలు ఏ రకమైన తీర్పు ఇచ్చారో గుర్తు చేసుకోవాలని అన్నారు. తెలంగాణలో రైతులకు ఒక న్యాయం, పారిశ్రామికవేత్తలకు మరొక న్యాయమా అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను కాదని పారిశ్రామికవేత్తలకే ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. హిల్ట్ పాలసీని హడావుడిగా తీసుకు వచ్చారని మండిపడ్డారు. హైదరాబాద్ నగరంలో ఇప్పటికే అనేక మౌలిక సమస్యలు ఉన్నాయని, ఇప్పుడు హిల్ట్ పేరుతో నగరంలో 9 వేల ఎకరాల్లో మల్టీపర్పస్ కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తే జరగబోయే పరిణామాలను ముఖ్యమంత్రి అంచనా వేశారా అని నిలదీశారు. హైదరాబాద్ నగరాన్ని మరో బెంగళూరుగా మార్చాలని చూస్తున్నారా అని ప్రశ్నించారు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్య కారణంగా పెట్టుబడులు వెనక్కి వెళ్లాయని గుర్తు చేశారు. ఇప్పుడు హైదరాబాద్‌ను కూడా అదే స్థితికి తీసుకురావాలనుకుంటున్నారా అని ప్రశ్నించారు. ఈ రాష్ట్రంలో తాను ఏకైక మేధావినని గతంలో కేసీఆర్ నిర్ణయాలు తీసుకున్నారని, ఇప్పుడు మరొక మేధావి రేవంత్ రెడ్డి వచ్చారని విమర్శించారు.

# గ్లోబల్ సమ్మిట్‌కు రండి

- ప్రధాని మోడీకి సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానం
- 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్
- రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీకి కూడా రేవంత్ ఇన్విటేషన్

**అఖండసూర్య, హైదరాబాద్**



దేశ రాజధాని న్యూఢిల్లీలో పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక రాజకీయ, పరిపాలనా సమావేశాలతో బిజీగా గడిపారు. ఆయనతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా ఈ భేటీల్లో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో భేటీ అయి రాబోయే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్-2025'కు స్వయంగా హాజరు కావాలని ఆహ్వానం అందజేశారు. ఈ సమిట్ ఈ నెల 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనుంది. తెలంగాణ అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, ప్రపంచ పెట్టుబడిదారులను ఆకర్షించే ప్రాధాన్య రంగాల గురించి సీఎం ప్రధానితో చర్చించినట్లు తెలుస్తోంది. ప్రధానితో జరిగిన ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రానికి అత్యవసరమైన పలు కీలక ప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా హైదరాబాద్-బెంగళూరు-చెన్నై బుల్లెట్ రైలు కారిడార్‌లో హైదరాబాద్‌ను తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలని కోరారు. అలాగే, హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు వెంటనే అనుమతులు మంజూరు చేసి, కేంద్ర భాగస్వామ్య నిధులు విడుదల చేయాలని అభ్యర్థించారు. రాష్ట్ర రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి రీజినల్ రింగ్ రోడ్ దక్షిణ భాగ ప్రాజెక్టు పనులు వేగవంతం కావాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, దీనికి సంబంధించిన అనుమతులు, నిధులను కేంద్ర ప్రభుత్వం త్వరగా ఆమోదించాలని ఆయన కోరారు. పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమై సమిట్‌కు వ్యక్తిగతంగా ఆహ్వానాలు అందజేశారు. తరువాత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీలను సమిట్‌కు రావాలని ఆహ్వానిస్తూ ముఖ్యమంత్రి ప్రత్యేకంగా కలిసారు. అదేవిధంగా, మంగళవారం రాత్రి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిసి 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్' గురించి వివరాలు తెలియజేస్తూ ఆయనను కూడా సమిట్‌కు రావాలని కోరారు. దేశవ్యాప్తంగా పెట్టుబడులు సమీకరించడంలో ఈ సమిట్ కీలక పాత్ర పోషించనుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ పర్యటనతో రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర సహకారం లభించే అవకాశాలు మెరుగుపడతాయని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.



## అంతా తప్పుడు ప్రచారం

**మొదటిపేజీ తరువాయి**

చూపుతున్నారన్నారు. హిందూ దేవుళ్లు మూడు కోట్ల మంది ఉన్నారని, అనేక దేవుళ్లలో సారూప్యతలు ఉన్నాయని చెప్పిన నేపథ్యంలోనే, అదే విధంగా కాంగ్రెస్ కూడా విభిన్నతలో ఐక్యతను ప్రతిబింబించే పెద్ద సమాజం** అని పోల్చి చెప్పానని రేవంత్‌రెడ్డి వివరించారు.

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమి భయంతో బీజేపీ హంగామా**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ డిపాజిట్ కూడా కాపాడుకోలేకపోయిందని, ఈ పరాభవాన్ని దాచిపెట్టేందుకు ఇలాంటి చిన్న విషయాలను పెద్దదిగా చేస్తూ వివాదాలు రేకెత్తిస్తున్నదని సీఎం రేవంత్ విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలు బీజేపీకి శాసనం చెప్పారని, అందుకే ఈ తరహా ప్రచారాలతో ఏజెండాను మళ్లించే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులతో జరిగిన సమావేశంలో పార్టీ బలోపేతం, ప్రజలతో అనుసంధానం, భవిష్యత్ కార్యాచరణపై పలు కీలక సూచనలు ఇచ్చానని రేవంత్‌రెడ్డి తెలిపారు.



## బీడీ, చుట్ట కార్మికులకు భరోసా..

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**



దేశంలోని బీడీ, చుట్ట కార్మికుల సంక్షేమం దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. కొత్తగా అమలులోకి వచ్చిన కార్మిక చట్టాల (లేబర్ కోడ్స్) ద్వారా ఈ రంగంలోని కార్మికులకు మెరుగైన వేతన భద్రత, సామాజిక భద్రత, సురక్షితమైన పని వాతావరణం కల్పిస్తున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నూతన సంస్కరణలతో ఈ రంగాన్ని మరింత క్రమబద్ధీకరించడం ద్వారా కార్మికుల జీవనోపాధికి స్థిరత్వం లభిస్తుందని ప్రభుత్వం పేర్కొంది. గతంలో ఉన్న 1966 నాటి చట్టం ప్రకారం కార్మికులకు పరిమిత రక్షణ మాత్రమే ఉండేది. రోజువారీ పని గంటలు 9 వరకు ఉండగా, వేతనంతో కూడిన వార్షిక సెలవు పొందాలంటే క్యాలెండర్ సంవత్సరంలో 240 రోజులు పనిచేయాల్సి వచ్చేది. వారికి ఎలాంటి వైద్య పరీక్షల సౌకర్యం కూడా ఉండేది కాదు. అయితే, కొత్తగా వచ్చిన ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ (OSHWC) కోడ్, 2020 ఈ లోపాలను సరిదిద్దింది. తాజా నిబంధనల ప్రకారం రోజువారీ పని గంటలను 8 గంటలకు పరిమితం చేశారు. వారానికి 48 గంటల పని పరిమితిని కొనసాగించారు. నిర్ణీత సమయం కంటే అదనంగా పనిచేస్తే (ఓవర్ టైమ్) సాధారణ వేతనానికి రెట్టింపు చెల్లించడం తప్పనిసరి చేశారు. ఇకపై 180 రోజులు పనిచేస్తేనే వేతనంతో కూడిన వార్షిక సెలవుకు అర్హత లభిస్తుంది. దీంతోపాటు, ఉద్యోగులకు ఏటా ఉచిత ఆరోగ్య పరీక్షలు (హెల్త్ చెకప్) చేయించాలని కూడా కొత్త చట్టం స్పష్టం చేస్తోంది. అంతేకాకుండా ప్రభుత్వం నిర్దేశించిన కనీస వేతనం కంటే తక్కువ ఏ ఉద్యోగికి చెల్లించరాదని కొత్త చట్టాలు స్పష్టం చేస్తున్నాయి. గతంలో షెడ్యూల్డ్ ఉద్యోగులకు మాత్రమే వర్తించే ఈ నిబంధన, ఇప్పుడు అందరికీ వర్తిస్తుంది. కార్మికుల వలసలను తగ్గించే ఉద్దేశంతో కనీస జీవన ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఫ్లోర్ వేజ్‌ను నిర్ణయిస్తుంది. ఈ కొత్త చట్టాలు కార్మికులకు ఆర్థిక స్థిరత్వాన్ని అందించడమే కాకుండా, వారి జీవితాలకు గౌరవప్రదమైన భరోసా కల్పిస్తాయని ప్రభుత్వం వివరించింది.

## కేటీఆర్ ఇక్కడ రాజకీయం చెయ్..
# రేవంత్ రెడ్డి సహా మేం సిద్ధం

- రాహుల్ గాంధీని విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరిక
- రాహుల్ గాంధీది త్యాగాల కుటుంబమన్న జగ్గారెడ్డి
- కేసీఆర్ కుటుంబం ఉద్యమం సమయంలో రాజకీయం చేసిందని విమర్శ

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణలో రాజకీయాలు చేసుకోవచ్చని, ఆయనను ఎదుర్కొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, తాము సిద్ధంగా ఉన్నామని తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. అయితే, జాతీయ నాయకుడు రాహుల్ గాంధీని విమర్శిస్తే మాత్రం ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమం సమయంలో కేసీఆర్ కుటుంబం రాజకీయ లబ్ధి పొందిందని ఆరోపించారు. తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి, ప్రశ్నించే హక్కు కేటీఆర్‌కు లేదని ఆయన అన్నారు. రాహుల్ గాంధీది త్యాగాల కుటుంబమని, కేసీఆర్ కుటుంబం ఉద్యమం జరుగుతున్నప్పుడే రాజకీయంగా ఎదిగిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విలువల్లేని రాజకీయాలు ఏమాత్రం మంచిది కాదని ఆయన హితవు పలికారు. కేటీఆర్‌కు నైతిక విలువలు ఉంటే రాహుల్ గాంధీ గురించి మరోసారి ఇష్టానుసారంగా మాట్లాడవద్దని అన్నారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ అని, బీఆర్ఎస్ ప్రాంతీయ పార్టీ అని గుర్తు చేశారు. కేటీఆర్ తెలంగాణలో రాజకీయం చేసుకోవచ్చని, కానీ రాహుల్

## సంచార్ సాథీ
# తప్పనిసరి ఏం కాదు

**మొదటిపేజీ తరువాయి**




భావించింది. ముఖ్యంగా ప్రభుత్వం ఆదేశాల తర్వాత యాప్‌ను స్వచ్ఛందంగా డౌన్‌లోడ్ చేసుకునే వారి సంఖ్య భారీగా పెరగడం కీలక కారణంగా పేర్కొంది. ''సంచార్ సాథీ యాప్‌కు స్పందన భారీగా ఉంది. తప్పనిసరి చేయడం వెనుక నిజమైన ఉద్దేశం యాప్ గురించి ప్రజల్లో అవగాహన కల్పించడమే. ఆ లక్ష్యం ఇప్పటికే నెరవేరింది'' అని టెలికాం విభాగం తన ప్రకటనలో తెలిపింది.

**ప్రకటనలో మరింతగా వెల్లడించిన వివరాల ప్రకారం**

* కేంద్ర ఆదేశాల తర్వాత *ఒక్కరోజులోనే ఆరు లక్షల మంది* సంచార్ సాథీలో రిజిస్టర్ అయ్యారు.

* ఇది సాధారణ సమయంలో కంటే *దాదాపు పదింతల పెరుగుదల*.

* యాప్‌కు పెరుగుతున్న ఆదరణను పరిగణనలోకి తీసుకుని తప్పనిసరి ఇన్‌స్టలేషన్ అవసరం లేదని ప్రభుత్వం నిర్ణయించింది.

సంచార్ సాథీ యాప్ ద్వారా వినియోగదారులు తమ మొబైల్ కనెక్షన్ల వివరాలను తనిఖీ చేయడం, అనుమానాస్పద సిమ్‌లను గుర్తించడం, ఫోన్ దొంగతనం లేదా మోసాలకు గురైనప్పుడు సత్వర చర్యలు తీసుకోవడం వంటి సౌకర్యాలు లభిస్తాయి. గత ఏడాది ప్రారంభించిన ఈ యాప్ ఇప్పటికే దేశవ్యాప్తంగా లక్షలాది యూజర్లను కలిగి ఉంది.
కేంద్రం తాజా నిర్ణయంతో యాప్ వినియోగం స్వచ్ఛందంగా కొనసాగుతుండగా, సైబర్ సెక్యూరిటీపై అవగాహన పెరగడమే అత్యంత ముఖ్యమని అధికారులు పేర్కొన్నారు.

# కోకాపేటలో ఎకరం రూ.131 కోట్లు

**మొదటిపేజీ తరువాయి**

బిడ్లు నమోదు చేయడంతో పోటీ మరింత హోరాహోరీగా మారింది. ఇప్పటి వరకు ముగిసిన మూడు విడతల వేలంలో మొత్తం *ఆరు ప్లాట్లలోని 27 ఎకరాలు* అమ్ముడుపోయాయి. వీటి ద్వారా హెచ్ఎండీఏకు మొత్తం రూ.3,708 కోట్లు ఆదాయం వచ్చింది. ప్రతి విడతలో ధరలు పెరుగుతుండటం హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం ఎంత బలంగా ఉన్నదో సూచిస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు. హెచ్ఎండీఏ మొత్తం *44 ఎకరాల* భూమిని నాలుగు విడతల్లో వేలం వేయాలని నిర్ణయించగా, మిగిలిన భూముల వేలం ప్రక్రియ కూడా త్వరలోనే కొనసాగనుంది. ఈ క్రమంలో *కోకాపేట గోల్డెన్ మైల్‌లోని 2 ఎకరాలు, **మూసాపేటలోని 15 ఎకరాల* భూమికి వచ్చే *డిసెంబర్ 5న* ఈవేలం నిర్వహించనున్నారు. ఈ వేలాలలో కూడా భారీ ధరలు వచ్చే అవకాశం ఉందని రియల్‌టీ రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. కోకాపేట, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ఎన్ఐసీ ప్రాంతాల అభివృద్ధితో పాటు రింగ్ రోడ్ సమీపం, మెరుగైన కనెక్టివిటీ ఉండటంతో ఈ ప్రాంతాల్లో భూముల విలువ నిరంతరం పెరుగుతోంది. దీంతో ప్రీమియం కమర్షియల్, రెసిడెన్షియల్ ప్రాజెక్టుల కోసం సంస్థలు పోటీ పడుతున్నాయి.




ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
04.12.2025
గురువారం | హైదరాబాద్
www.prajaswaramdaily.com


# ఖమ్మం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

మొదటిపేజీ తరువాయి

గమనించి వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. అప్రమత్తమైన సత్తుపల్లి పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.
ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. మృతుల వివరాలు సేకరించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని, ప్రమాదానికి గల కారణాలు స్పష్టంగా తెలుసుకోవడానికి వాహన వివరాలు, సీసీ కెమెరా ఫుటేజీలు కూడా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఈ ఘటనతో ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



# తల్లి సమాధి వద్దే మూడు రోజులుగా

**కరీంనగర్ డిసెంబర్ 02(ప్రజాస్వరం)**

తెలంగాణలో జరిగిన ఒక తీవ్ర బాధాకరమైన సంఘటనలో నిరాశకు గురైన ఒక యువతి వరుసగా మూడు రోజులుగా తన తల్లి సమాధి వద్ద నిద్రపోతోంది. ఆమె తన తల్లిని కోల్పోయిన దుఃఖాన్ని తట్టుకోలేకపోతున్నట్లు తెలిపింది. కరీంనగర్ జిల్లాలోని ఒక శ్మశానవాటికలో ఈ హృదయ విదారక దృశ్యం వెలుగులోకి వచ్చింది. తెలంగాణలోని స్థానిక నివాసితులు, ఆమె కుటుంబ సభ్యులలో రాత్రింబవళ్ళు నిరాశతో ఉన్న మహిళ సమాధి దగ్గర ఉండటం ఆందోళన కలిగించింది. స్థానిక మానవతావాదులు షీ టీమ్స్,మహిళా సంక్షేమ అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషాదాన్ని తట్టుకుని నిలబడటానికి మహిళకు అవసరమైన రక్షణ, మానసిక మద్దతు, వైద్య సంరక్షణ అందించాలని కోరారు.



# ఘనంగా ప్రపంచ వికలాంగుల దినోత్సవం

**కాప్రా డిసెంబర్ 03(ప్రజాస్వరం):**


కాప్రా మున్సిపల్ సర్కిల్‌లో ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్టాండింగ్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. వికలాంగుల సంఘాలకు నలభై లక్షల రుణాలను ప్రాజెక్టు అధికారి పద్మావతి చెక్కుల రూపంలో అందజేశారు. ఆటలలో విజయం సాధించిన 26 మందికి బహుమతులు పంపిణీ చేయగా, 500 మందికి దుప్పట్లు, భోజనం ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో వికలాంగులు హాజరయ్యారు. స్థానిక వికలాంగుల సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.



# పొడుస్తున్న పొద్దు మీద

- **కలిసి వచ్చే కాలానికి.. నడిచి వచ్చే సీసాలు**
- **ముహూర్తం చూసి.. మద్యం సీసాలు అమ్మకాలు**
- **ఈసారి చాలా మంది కొత్తవారు మద్యం వ్యాపారంలోకి దిగడంతో పూజలు, ముహూర్తాలపై మరింత శ్రద్ధ**
- **కొత్త మద్యం దుకాణాలు తొలిరోజే కిటకిట!**
- **డిసెంబర్ 1ఉదయమే ప్రత్యేక పూజలతో యజమానుల హడావుడి..**
- **-పలుచోట్ల స్థానికుల అభ్యంతరాలు, అద్దెకు షాపులు దొరక్క బ్రేక్..**

**తెలంగాణ బ్యూరో డిసెంబర్ 02(ప్రజాస్వరం):**



రాష్ట్రంలో కొత్త మద్యం దుకాణాలు తొలిరోజే కళకళలాడాయి. దుకాణాలు దక్కించుకున్నవారు.. సోమవారం ఉదయమే దుకాణాలను అలంకరించి, పండితులను పిలిపించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో హడావుడి కనిపించింది. నిర్వాహకులు తమకు కలిసివచ్చే ముహూర్తం చూసుకుని షాపులు తెరిచి, విక్రయాలు మొదలుపెట్టారు. బేవరేజెస్ కార్పొరేషన్ డిపోల నుంచి ఆదివారం అర్ధరాత్రి దాకా ఆయా మద్యం దుకాణాలకు సరుకు సరఫరా కావడంతో తొలి రోజే కొత్తస్టాక్‌తో విక్రయాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాలుండగా.. ఈసారి చాలా మంది కొత్తవారు మద్యం వ్యాపారంలోకి దిగడంతో పూజలు, ముహూర్తాలపై మరింత శ్రద్ధ పెట్టినట్లు కనిపించింది. తొలిరోజే దుకాణాలు కిటకిటలాడాయి. ఇక హైదరాబాద్‌తో పాటు పలు జిల్లా కేంద్రా ల్లో ఈసారి చాలా మద్యం దుకాణాల్లో అనుబంధంగా వాకిన్ స్టోర్లను ఏర్పాటు చేశారు. సూపర్ మార్కెట్ల తరహాలో వినియోగదారులు వాటిలోపలికి వెళ్లి నచ్చిన మద్యాన్ని ఎంచుకుని కొనుగోలు చేయవచ్చు. లైసెన్సు ఫీజుకు అదనంగా రూ.5లక్షలు చెల్లించిన మద్యం దుకాణాలకు ఈ అవకాశం. ఈ కొత్త దుకాణాల పాలసీ గడువులో ప్రభుత్వానికి గతంలో కంటే భారీగా ఆదాయం వస్తుందని ఎక్సైజ్‌శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

**కొన్నిచోట్ల ఆగిన ప్రారంభం**

కొత్త మద్యం దుకాణాలకు పలుచోట్ల స్థానికులు అభ్యంతరం తెలపడంతో ప్రారంభం కాలేదు. దేవాలయాలు, విద్యాసంస్థలు, నివాస ప్రాంతాల్లో దుకాణాలు చేస్తుండటంపై స్థానికుల్లో వ్యతిరేకత వ్యక్తమైంది. మరికొన్ని చోట్ల తగిన షాపులు అద్దెకు దొరక్కపోవడంతోనూ ప్రభావం పడింది. రంగారెడ్డి ఎక్సైజ్ డివిజన్ పరిధిలో దాదాపు 25 దుకాణాలు సోమవారం ప్రారంభం కాలేదు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఒకటీరెండు చోట్ల ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని ఎక్సైజ్‌శాఖ అధికారులు చెబుతున్నారు.

# పొద్దుటూరు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

- **సర్పంచ్ అభ్యర్థి గా నామినేషన్ వేసిన బండ లక్ష్మి, నర్సింహా**

**శంకర్ పల్లి డిసెంబర్ 02(ప్రజాస్వరం):**

గ్రామ ప్రజల ఆశీర్వదిస్తే పొద్దుటూరు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని సర్పంచ్ అభ్యర్థి బండ లక్ష్మి, నర్సింహా అన్నారు. రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండల పరిధిలోని పొద్దుటూరు గ్రామానికి చెందిన సర్పంచిగా అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మి, నర్సింహా మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన అన్నారు. గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు ఆదర్శవంతమైన పాలన, మహిళా సాధికారతే లక్ష్యంగా




ముందుకు తీసుకు వెళ్తానని అన్నారు. ప్రజలు ఆశీర్వదించి సర్పంచిగా గెలిపించే అవకాశం ఇస్తే గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీ సుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అంధకారంలో శంకర్‌పల్లి బస్ స్టేషన్

- **ఆరు నెలలు గడుస్తున్నా కంట్రోలర్ లేరు**

**శంకర్‌పల్లి డిసెంబర్ 03(ప్రజాస్వరం):**

శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్ స్టేషన్ నిరుపయోగంగా మారింది. రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలు లేక చిమ్మ చీకటిగా మారి విద్యార్థులకు, మహిళలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేకుండా పోయింది. ఆరు నెలలు గడుస్తున్నా బస్ స్టేషన్ లో కంట్రోలర్ అధికారి లేడు. ప్రజలు రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వ అధికారులు ఇకనైనా పట్టించుకుని విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, కంట్రోలర్ అధికారిని నియమించాలని మండల, పట్టణ ప్రజలు కోరుతున్నారు.



# సర్కార్ భూమిలో వైన్స్ కట్టడం యువజన కాంగ్రెస్ నేత ఫిర్యాదు

**కీసర డిసెంబర్ 03(ప్రజాస్వరం):**

కీసర మండలం అహమ్మద్‌గూడా గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమంగా వైన్స్ షాపు నిర్మించారని ఆరోపిస్తూ తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు బూడిద ప్రేమ్ కుమార్ గౌడ్ మండల ఎమ్మార్వోకు ఫిర్యాదు చేశారు. అహమ్మద్‌గూడా సర్వే నెంబర్ 89లో అసైన్మెంట్‌గా ఉన్న సుమారు రెండు ఎకరాల 30 గుంటల భూమి గతంలో పిఓటి కింద రెవెన్యూ శాఖ జప్తు చేసినప్పటికీ, అదే భూమిలో కొత్తగా వైన్స్ షాపు ఎలా వెలిసిందని ప్రశ్నించారు. ప్రభుత్వానికి చెందిన 18 గుంటల భూమి కూడా ఆక్రమణకు గురైందని ఆయన పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు, కీసర తహసీల్దార్, జిల్లా కలెక్టర్‌లకు గ్రామస్థులు పలుమార్లు ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. ప్రభుత్వ భూమిని ఎవరి ఆధారంతో, ఏ నియమాల ప్రకారం ఎక్సైజ్ శాఖ వైన్స్ షాపుగా కేటాయించిందన్న అంశంపై ప్రజల్లో అనేక



అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ప్రేమ్ కుమార్ గౌడ్ చెప్పారు. ఇలాంటి ఆక్రమణల వెనుక రాజకీయ అండదండలు ఉన్నాయనే అనుమానాలపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆయన మండిపడ్డారు. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనప్పటికీ, రెవెన్యూ శాఖ నిమ్మకు నీళ్లు ఎత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. సర్వే నెంబర్ 89కు సంబంధించిన జప్తు భూమిలో ఏర్పాటైన అక్రమ వైన్స్ షాపును తొలగించి, కేటాయించిన టెండర్లను రద్దు చేయాలని మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్‌ను గ్రామస్థులు, ప్రజలు కోరుతున్నారు.

# గద్వాల ఎస్టీ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్..

- **12 మంది విద్యార్థులకు అస్వస్థత, ఒకరికి సీరియస్**

**గద్వాల డిసెంబర్ 02(ప్రజాస్వరం):**

ప్రభుత్వ హాస్టళ్లలో వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకుంటున్నప్పటకీ రేవంత్ రెడ్డి సర్కార్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నది. కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నా, ప్రాణాలు కోల్పోతున్నా పట్టించుకోవడం లేదు. తాజాగా గద్వాల ఎస్టీ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ జరిగింది. కలుషిత ఆహారం తినడంతో 13 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో సిబ్బంది వారిని గద్వాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మెనూ సక్రమంగా లేదని అధికారులకు తెలియజేసిన పట్టించుకోకపోవడం వల్లే ఈ ఘటన జరిగిందని విద్యార్థులు తెలిపారు. ఉదయం ఉప్మా వండిన తర్వాత దాంట్లో పురుగులు ఉన్నాయని హాస్టల్ నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లామని, దీంతో దానిని పారబోశారని చెప్పారు. అంతకుముందు దానిని తిన్న వారు అస్వస్థతకు గురయ్యారని పేర్కొన్నారు. వసతి గృహంలో మొత్తం 120 మంది విద్యార్థులు ఉన్నారు.



# ఆరోగ్యానికి ఐదు సూత్రాలు

- **పిల్లల ఆరోగ్యం పై నిర్వహించిన అవగాహన సదస్సులో డాక్టర్ కె వి కృష్ణారావు**

**ఖమ్మం డిసెంబర్ 03(ప్రజాస్వరం):**

టేకులపల్లి గురుకులంలో న్యూ లక్ష్య స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. సంస్థ అధ్యక్షులు గరిడేపల్లి సత్యనారాయణ అధ్యక్షతన పిల్లల ఆరోగ్యం పై అవగాహన సదస్సు జరిగింది.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ కె వి కృష్ణారావు పాల్గొని ప్రసంగించారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే 5 సుత్రాలు పాటించాలిఅన్నారు. ఈ 5 సుత్రాలు సమతుల్య ఆహారం, ప్రశాంతమైన నిద్ర, శారీరక శ్రమ, పరిశుభ్రత, వినోదం అని అయన పేర్కొన్నారు. సమతుల్య ఆహారం అంటే విటమిన్లు, మినరల్స్, పీచు పదార్థాలు, పిండి పదార్థాలు, మాంసం కృతులు, కొవ్వు పదార్థాలు సమపాళ్ళలో ఉండాలన్నారు. పిల్లల ఎదుగుదలకు మూడు రకాల ఎలిమెంట్స్ అవసరం అని ఆయన తెలిపారు. ఐరన్, క్యాల్షియం, జింకు, యాపిల్ గాని బెల్లం గాని ఖర్జూర పండ్లు, పాలకూర, మటన్, బీట్రూట్, మునగాకు, కిస్ మిస్ లు లాంటివి తీసుకుంటే ఐరన్ వస్తుంది అయన అన్నారు. నువ్వులు, తమలపాకులు, రాగిజావ లాంటివి తీసుకుంటే క్యాల్షియం లభిస్తుంది అయన పేర్కొన్నారు. బూడిద గుమ్మడికాయ గింజలు, సన్ఫ్లవర్ గింజలు, పల్లీలు తినడం వల్ల జింకు వస్తది ఆయన తెలిపారు. ఇటువంటి పదార్థాలు తీసుకోవడం వల్ల చాలా వరకు జబ్బులు రాకుండా ఉంటాయని అయన అన్నారు. కావున పిల్లలకు రాగి జావను మజ్జిగలో గానీ బెల్లం వేసి తాపించాలి అని అయన తెలిపారు. నువ్వులు బెల్లం ఉండలు కలిపి తింటే ఐరన్ ఐరన్ మరియు క్యాల్షియం వస్తాయన్నారు. ప్రశాంతమైన నిద్ర అంటే పిల్లలు 6 నుంచి ఎనిమిది గంటలు విధిగా నిద్ర పోవాలి అని అయన తెలిపారు. దీనివలన బాడీ అంతా రిపేర్ అయి రోగ నిరోధక శక్తి పెరిగి ఎటువంటి జబ్బులు రాకుండా ఉండటానికి దోహదపడుతుంది వివరించారు. శారీరక శ్రమ అంటే పిల్లలు ఉదయం పూట ప్రతిరోజు ఎండలో ఒక గంట సమయాన్ని కేటాయించి వాకింగ్, రన్నింగ్, సైక్లింగ్, యోగ లాంటి వ్యాయామలు చేయాలన్నారు. దీనివలన శరీరం రిలీఫ్ అయ్యి హ్యాపీ హార్మోన్స్ విడుదల అయి మానసికమైన ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. విటమిన్ డి వలన రోగ నిరోధక శక్తి పెరిగి ఎటువంటి జబ్బులు రాకుండా ఉండటానికి దోహద పడుతుంది చెప్పారు. పరిశుభ్రత లో వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత లు ఉంటాయన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత అంటే శరీరానికి శుభ్రంగా ఉంచుకోవడం, గోర్లు కత్తిరించుకోవడం ఎప్పటికప్పుడు చేతులను హ్యాండ్ వాష్ తో శుభ్రంగా కడుక్కోవడం వల్ల చాలా రకాల జబ్బులు రాకుండా చూసుకోవచ్చు అని వివరించారు. పరిసరాల పరిశుభ్రత లో ఇంటి చుట్టుపక్కల పిచ్చి మొక్కలు , వేస్ట్ నీరు నిలవ లేకుండా చేయడం వల్ల దోమలు ఉండవు దాని వలన మలేరియా, బోదకాలు, డెంగు లాంటి జబ్బులు రాకుండా ఉంటాయి తెలియజేశారు. వినోదం అంటే పిల్లలను సంతోషం పరిచే సినిమాలు, టీవీలలో కార్యక్రమాలు గాని, కామెడీ దృశ్యాలు పిల్లలు చూడటం వల్ల ఆహ్లాదము సంతోషం కలిగి మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు అని ఆయన అన్నారు. దీంట్లో భాగంగా పిల్లలను అప్పుడప్పుడు పార్కు మరియు టూర్లకు తీసుకుని పోవడం వలన వాళ్ల మానసిక ఆరోగ్యం మెరుగు అవుతుంది. అలాగే డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్త వహించాలి ఆయన హెచ్చరించారు. హాస్టల్లో ఉన్న పిల్లలకు ఎక్కువ శాతం ఎలర్జీ వస్తది




కావున గజ్జి తామర రాకుండా ఉండాలంటే తడి దుస్తులు ధరించకూడదు. కావున పొడి దుస్తులు ధరించాలి అని తెలిపారు. ఒకవేళ వ్యాధులు వస్తే వెంటనే చర్మవ్యాధుల డాక్టర్ ను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం సునీత, వైస్ ప్రిన్సిపాల్ ఏ రీనాధారిదేవి, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ డి స్వప్న లత, & కే శైలజ, దొడ్డ శ్రీనివాస్ రెడ్డి మరియు టీచింగ్ స్టాఫ్ స్టూడెంట్స్ తదితరులు పాల్గొన్నారు.





# సీఎం రేవంత్ వ్యాఖ్యలపై బీజేపీ నాయకుల నిరసన

**మెదక్, డిసెంబర్ 03 (ప్రజా స్వరం) :**

సీఎం రేవంత్ రెడ్డి హిందూ దేవులపై చేసిన వ్యాఖ్యలకు ఖండిస్తూ బుధవారం మెదక్ జిల్లా రాందాస్ చౌరస్తా వద్ద బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు సీఎం రేవంత్ కి నిరసన గా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ డీసీసీ సమావేశంలో హిందూ దేవులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్నటువంటి వేళ ఒక వర్గం ఓట్లు కాంగ్రెస్ పార్టీ వైపు మరల్చుకోవడానికి తిప్పుకోవడానికి ఈ కుట్ర చేశారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి హిందూ దేవతామూర్తులకు అందరికీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, జిల్లా కార్యదర్శి కల్కి నాగరాజు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ సంగీత, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు సతీష్, జిల్లా నాయకులు లోకేష్, శివ, అల్లం మధు, యువ మోర్చా నాయకులు రాహుల్, బబ్లు, సన్నీ, సాయి, సాయిరామ్ పాల్గొన్నారు.



# సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలి





- **వైజ్ఞానిక ప్రదర్శనకు 17 కమిటీల ఏర్పాటు**
- **36 ప్రాజెక్టులలో విద్యార్థులు పాల్గొనేలా చర్యలు**
- **జిల్లా విద్యాధికారి విజయ**

**మెదక్ డిసెంబర్ 03 (ప్రజా స్వరం) :**


ఈ నెల 4, 5 తేదీలలో మెదక్ పట్టణంలోని వెస్లీ ఉన్నత పాఠశాలలో జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి విజయ తెలిపారు. బుధవారం మెదక్ జిల్లా కేంద్రం లోని గోల్ బంగ్లా లో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ఏర్పాట్ల ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్ నిర్వహణ కోసం 17 కమిటీల ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీలన్నీ సమన్వయంతో పని చేయాలని సూచించారు. వైజ్ఞానిక ప్రదర్శనలో సుస్థిర భవిష్యత్తు కోసం శాస్త్ర సాంకేతిక, ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, రవాణా, కమ్యూనికేషన్, సహజ వ్యవసాయం, విపత్తుల నిర్వహణ, గణిత నమూనాలు, గణన ఆలోచన, వ్యర్థాల నిర్వహణ, వనరుల నిర్వహణ, తదితర అంశాలపై నూతన ఆవిష్కరణలో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. బీఈడీ బీఈడీ శిక్షణ విద్యార్థులు కూడా నూతన ఆవిష్కరణలతో కూడిన బోధన అభ్యసన సామాగ్రిని ప్రదర్శించవచ్చునని తెలిపారు. ఈ సైన్స్ ఫెయిర్ ను విజయవంతం చేయాలని ప్రధానోపాధ్యాయులను, గైడ్ టీచర్లను కోరారు. డీఈవో వెంట జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుదర్శన మూర్తి, మండల విద్యాశాఖ అధికారులు, శంకర్, మధుమోహన్, సత్యనారాయణ, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ నాగుల్ మీరా, మల్లేశం, కమిటీ కన్వీనర్లు , కో కన్వీనర్లు, సభ్యులు, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# చికిత్స పొందుతూ మృతి

**నార్సింగి డిసెంబర్ 03(ప్రజా స్వరం) :**



ద్విచక్ర వాహనానికి కుక్క అడ్డు రాగా తప్పించబోయిన వ్యక్తికి తీవ్ర గాయాలయి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ బీమరి సృజన తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన బక్కన్నగారి అంజన్ రెడ్డి (50) తండ్రి నారాయణరెడ్డి ఈ నెల 1 న సోమవారం ఉదయం తన స్వంత పని నిమిత్తం తన ద్విచక్ర వాహనం పై చేగుంటకు వెళ్ళి నార్సింగి కి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో మండల కేంద్రం లోని సర్వీస్ రోడ్డు పై గల మహర్షి విద్యాలయం వద్దకు చేరుకోగా దారికి కుక్క అడ్డం రావడంతో దానిని తప్పించే క్రమంలో అంజన్ రెడ్డి వాహనం అదుపు తప్పి కింద పడి తీవ్ర గాయాలు అయి అపస్మారక స్థితి లోకి వెళ్ళిపోయాడు. గమనించిన స్థానికులు పక్కనే గల ఓ ప్రైవేట్ ఆసుపత్రి కి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. అంజన్ రెడ్డి అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 2 మంగళవారం రాత్రి 8:30 ప్రాంతంలో మరణించారు. మృతుని భార్య బక్కన్నగారి సౌమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, రామాయంపేట కమ్యూనిటీ ఆసుపత్రిలో పోస్ట్ మార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సృజన తెలిపారు.

# ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

**గజ్వేల్ డిసెంబర్ 03 (ప్రజాస్వరం) :**

కుకునూరుపల్లి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ హై స్కూల్‌లో దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుండి వచ్చిన దివ్యాంగ విద్యార్థులు ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కుకునూరుపల్లి మండల ఎంఈఓ బచ్చలి సత్తయ్య గారు, శ్రీనివాస్ సార్, అశోక్ సార్, భవ్య గారు, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పంజాల ప్రశాంత్ గౌడ్ గారు పాల్గొన్నారు.





# చేప పిల్లల పంపిణీ

**దౌల్తాబాద్, డిసెంబర్ 3 (ప్రజాస్వరం) :**

దౌల్తాబాద్ మండలంలోని సూరంపల్లి, ముత్యంపేట గ్రామాల్లో మత్స్యకారులకు చేప పిల్లల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. మత్స్యకారుల ఆదాయాన్ని పెంచడం, గ్రామాల్లో చేపల ఉత్పత్తిని మరింతగా ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపల పెంపకం యోజనలను వేగవంతం చేస్తోంది. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ ఫీల్డ్ ఆఫీసర్ గౌతమి, దౌల్తాబాద్ వ్యవసాయ శాఖ అధికారి సంతోష్ కుమార్ పాల్గొని, రైతులకు చేప పిల్లల సంరక్షణ, ఆహార పంపిణీ, నీటిమట్టం నియంత్రణ, పండ్ల సమయంలో చేపలను మార్కెట్‌కు ఎలా విడుదల చేయాలన్న విషయాలపై స్పష్టమైన సూచనలు అందించారు. తక్కువ ఖర్చుతో అధికవిధంగా లాభాలు పొందే విధంగా అధికారులు మాట్లాడుతూ ఈ చేప పిల్లల పంపిణీ వల్ల గ్రామాల చెరువులలో చేపల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుంది. సరైన సంరక్షణ పాటిస్తే రైతులకు ప్రత్యక్షంగా ఆదాయం పెరుగుతుంది. మత్స్యకార కుటుంబాల ఆర్థికాభివృద్ధి ప్రధాన లక్ష్యం అని తెలిపారు. రైతులు ప్రభుత్వ సహకారం, సాంకేతిక మార్గదర్శకత్వం తాము చేపల పెంపకంలో కొత్త అవకాశాలకు దారిచూపుతుందంటూ సంతోషం వ్యక్తం చేశారు.

## బిజెపి నేతలను ముట్టుకుంటే ఖబర్దార్..

- **ఆవ శేఖర్ మృతిపై సమగ్ర విచారణ జరపాలి.**
- **లేదంటే బిజెపి ఆధ్వర్యంలో ఈనెల12 నుంచి ఆందోళనలు**
- **మృతుడి అంత్యక్రియలో పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్.**
- **మంత్రులు, ఎమ్మెల్యేల అండతో ఎన్నికల్లో రెచ్చిపోతే ఊరుకోం.**
- **కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలకు బీజేపీ హెచ్చరిక**



**ఫరూక్ నగర్,ప్రజాస్వరం :**

అభ్యర్థులకు అదృష్టం ఉంటే పదవులు వరిస్తాయి. ప్రజల ఆశీస్సులు ఉంటే గెలుపు వస్తుంది.. అంతేకానీ మంత్రులు, ఎమ్మెల్యేలు అండ చూసుకొని పోటీని అడ్డుకుంటే ఖబడ్దార్.. బిజెపి నాయకులను టచ్ చేస్తే చూస్తూ ఊరుకునేది లేదు.. అంటూ బిజెపి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్ కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు. ఫరూక్ నగర్ మండలం కంసాన్ పల్లి గ్రామంలో బిజెపి తరపున నాలుగవ వార్డు నుంచి పోటీ చేస్తున్న ఆవశేఖర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం గ్రామానికి వెళ్లిన జిల్లా అధ్యక్షుడు మృతుడి అంత్యక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ కాంగ్రెస్ లు దుర్మార్గంతో వ్యవహరిస్తూ యువకులను రాజకీయాల్లోకి రాకుండా అడ్డుకుంటున్నాయని అన్నారు. ఇకముందు ఇలాంటివి పునరావృతం అయితే తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. ఆవశేఖర్ కట్టర్ బిజెపి నాయకుడిగా ఉంటూ గ్రామంలో బిజెపికి వెలుగులు పంచాలని ప్రయత్నించాడని, అలాంటి వ్యక్తిపై ఒత్తిడి తెచ్చి అతని మరణానికి కారణమయ్యారని ఆరోపించారు. పోలీసులు సమగ్ర విచారణ జరిపి అలాంటి వ్యక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు ఉన్నందున ఈనెల 11 వరకు పోలీసులకు డెడ్లైన్ పెడుతున్నామని, ఈలోపు నిందితులెవరో, మరణానికి కారణం ఏమిటో తేల్చకపోతే 12వ తేదీ నుంచి పోలీస్ స్టేషన్ల ముందు ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఆవ శేఖర్ కు న్యాయం చేసేందుకు రోడ్ ఎక్కాల్సి వస్తుందని అన్నారు. దురదృష్టకరమైన ఈ సంఘటన బిజెపిని దిగ్భ్రాంతికి గురిచేసిందని, భవిష్యత్తులో ఇలాంటివి చోటు చేసుకోకుండా బిజెపి నాయకులకు అండగా ఉంటామని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నేతలు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, వంశీకృష్ణ, సుధాకర్ అప్ప తదితరులు పాల్గొన్నారు.

## దమ్మపేటలో తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది

**దమ్మపేట, డిసెంబర్ 03(ప్రజాస్వరం):**

మందలపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తాత్కాలిక వంట షెడ్ కూలిపోయిన ఘటనలో విద్యార్థులు, వంట సిబ్బంది తృటిలో ప్రాణాపాయం నుండి బయట పడ్డారు. స్కూల్‌కి నిర్మించాల్సిన శాశ్వత వంట షెడ్ ఇంకా పూర్తి కాకపోవడంతో, ఏళ్లుగా పాడుబడ్డ సైకిల్ షెడ్‌నే వంటశాలగా ఉపయోగిస్తున్నారు. సరుకులు, వంట సామాన్లు తరగతి గదుల్లో ఉంచినా, వంట మాత్రం ఇదే తాత్కాలిక షెడ్‌లో చేస్తున్నారు. వర్షాకాలంలో ఎన్నో ఇబ్బందులు పడుతుండగా, పాడైపోయిన ఈ షెడ్‌పై కోతులు ఎగిరి దూకడంతో, వర్షాలకు తడవడం కూడా కారణంగా అకస్మాత్తుగా షెడ్ కూలిపోయింది. అదృష్టవశాత్తూ, విద్యార్థులు-వంట మనుషులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ప్రాణనష్టం తప్పడంతో స్కూల్ సిబ్బంది, గ్రామస్థులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ సంఘటనపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ- - - ఎన్నోసార్లు ఎమ్మెల్యే, ఎంపిడిఓ దృష్టికి సమస్యను తీసుకెళ్లినా స్పందన రాలేదని మండిపడ్డారు. ఇకనైనా అధికారులు చొరవ తీసుకుని శాశ్వత వంట షెడ్‌ను అత్యవసరంగా నిర్మించాలని విద్యార్ధుల తల్లితండ్రులు కోరుతున్నారు.



## వనపర్తి జీజీహెచ్‌లో కొత్త ఏజెన్సీకి అధికారుల అడ్డంకులు

**వనపర్తి, డిసెంబర్ 03(ప్రజాస్వరం):**

వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన విజయేంద్ర ఏజెన్సీ అడుగుపెట్టిన తొలి రోజునుంచే ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఉద్యోగుల వర్గాలు ఆరోపిస్తున్నాయి. సెప్టెంబర్ 30తో పాత ఏజెన్సీ గడువు ముగియడంతో కొత్త ఏజెన్సీ తాత్కాలికంగా పనిచేయడం మొదలైంది. అయితే బయోమెట్రిక్-మాన్యువల్ హాజరు వివాదం కొత్త ఏజెన్సీని ఇరకాటంలో పడేసిందని స్టాఫ్ చెబుతున్నారు. గతంలో బయోమెట్రిక్‌కే సమ్మతి తెలిపిన హెచ్ ఆర్ ఎమ్ ఓ శివప్రసాద్, ఏఓ శ్రీనివాసులు——ఇప్పుడు అదే బయోమెట్రిక్ తప్పు, మాన్యువల్ కరెక్ట్ అంటూ మారిన తీరు ప్రశ్నార్థకంగా మారింది. ఇక మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ మల్లికార్జున్ కొత్త నిబంధనలు విధిస్తూ ఏజెన్సీ పనుల్లో ఆటంకాలు సృష్టిస్తున్నారని కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. తప్పుడు నివేదికలతో కొత్త ఏజెన్సీని ఇబ్బంది పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ సిబ్బంది మండిపడుతున్నారు. ఈ పరిణామాలపై కలెక్టర్ జోక్యం అవసరమని, నిజానిజాలు వెల్లడించి చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ ప్రతినిధులు కోరుతున్నారు.




# సేంద్రియ సాగు ప్రోత్సాహకానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలేంటి..?

- **పది వేల బయో - ఇన్ పుట్ పరిశోధన కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ, తెలంగాణ రాష్ట్రంలో పురోగతి వివరాలేంటి?**
- **లోక్ సభలో కోరిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి**
- **జవాబిచ్చిన కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి**

**ఖమ్మం డిసెంబర్ 03 (ప్రజాస్వరం):**

రైతులు తమ పంటచేలల్లో రసాయనిక ఎరువుల వినియోగానికి బదులుగా సేంద్రియ సాగును ప్రోత్సహించేలా బయో ఇన్ పుట్ రీసెర్చ్ సెంటర్ల (బీఆర్సీ) ఏర్పాటుకు రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో తెలపాల్సిందిగా ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి లోక్ సభలో కోరారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా బుధవారం ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ.. పరిశోధన కేంద్రాల పురోగతి వివరాలు తెలపాలన్నారు. దీనికి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖల సహాయ మంత్రి రామ్ నాథ్ ఠాకూర్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఇప్పటివరకు రాష్ట్రాల్లో 3, 517 బీఆర్సీల ఏర్పాటు రైతులకు సేంద్రియ సాగుపై అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్తంగా రాష్ట్రాల్లో 10,000 బయోఇన్ పుట్ రిసోర్స్ సెంటర్ల(బీఆర్సీ)ను ఏర్పాటు చేసేందుకు నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ (ఎన్ఎంఎన్ఎఫ్) సిద్ధంగా ఉందని, ఇప్పటివరకు 3,517 బీఆర్సీలను ఏర్పాటు చేసినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి తెలిపారు. క్లస్టర్ స్థాయి సంస్థగా రైతులకు ప్రత్యేక శిక్షణ, ప్రదర్శనలు ఉంటాయని, సొసైటీలు, రైతు ఉత్పత్తి సంస్థలు, స్వయం సహాయక బృందాలతో ఈ బీఆర్సీలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఖమ్మం జిల్లాలో 6 బయోఇన్ పుట్.రిసోర్స్.సెంటర్లు.



తెలంగాణ రాష్ట్రంలో సేంద్రీయ సాగు ప్రోత్సాహకానికి 250 బీఆర్సీ లను గుర్తించినట్లు, అందులో ఖమ్మం జిల్లాలో 6 ఉన్నాయని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి తెలిపారు. బీజామృత్, జీవామృత్, నీమాస్త్ర, దశపర్ని తదితర సేంద్రీయ ఎరువులను రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. రసాయనిక ఎరువులకు బదులు పంటల్లో తెగుళ్ల నివారణకు, మంచి దిగుబడికి ప్రణాళిక ప్రకారం సేంద్రీయ సాగును ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు.

## భవిత సెంటర్ నందు ఉచిత వైద్య శిబిరం

- **ముఖ్య అతిథులుగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.శిరీష**

**వలిగొండ డిసెంబర్ 03(ప్రజాస్వరం):**

మండల కేంద్రంలో గల భవిత సాహితీ విద్య వనరుల కేంద్రం నందు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అదేశాలనుసారం, మండల న్యాయ సేవా అధికార సంస్థ రామన్నపేట అధ్వర్యంలో మండల విద్యాధికారి గవ్వ జ్యోతి సమక్షంలో, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి రామన్నపేట డాక్టర్లు వరుణ్ రెడ్డి, ఉదయ్ లు కలిసి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఉచిత వైద్య శిబిరం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.శిరీష హాజరై మాట్లాడుతూ ఈ కేంద్రం నందు ఉన్న వారందరికీ ఇక్కడ అందించే సేవలు మరువలేనివి, మనం ఎంత చేసిన తక్కువనే అన్నారు. ఎంతో మందికి సేవా చేయాలనే నిండు మనస్సు తో ఎన్నో సేవలు చేస్తున్నారని కొనియాడారు. ఇక్కడ ఉండే దివ్యాంగ వికలాంగుల పట్ల అసభ్యకరంగా, చులకన భావంతో ఉండకూడదని, వారిలో ఎన్నో నైపుణ్యాలు దాగి ఉన్నాయని, వాటికి బయటికి తియలన్నారు. ఈ వైద్య శిబిరం నందు మొత్తం 20 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి పండ్లు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రాల జిల్లా ఇన్చార్జి లింగా రెడ్డి, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, లీగల్ సర్వీసెస్ టీమ్ సభ్యులు బత్తుల గణేష్, కానుగంటి శ్రీశైలం, రిసోర్స్ పర్సన్ జంగమ్మ, ఫిజియథెరపిస్ట్ శ్వేత, షఫీ, వైద్య సిబ్బంది సిస్టర్స్ బూపాల, సబిత, హనుమాన్ ప్రసాద్, విద్యార్థుల తల్లిదండ్రులు రేవతి, కవిత, బి.రేవతి, మమత, షమీమ్, పోలిస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## అరూర్ గ్రామానికి సేవ చేయడమే నా ఆశయం నన్ను ఆశీర్వదించండి

**వలిగొండ డిసెంబర్ 3(ప్రజాస్వరం):**



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని అరూర్ గ్రామానికి చెందిన వ్యక్తి సుక్క ముత్యాలు ను కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా బలపరచడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరూర్ గ్రామ ప్రజలకు, మా అక్క చెల్లెళ్లకు అన్నదమ్ములకు, నేను అరూర్ గ్రామ సర్పంచిగా పోటీ చేస్తున్నాను, నాకు ఎలాంటి ఆశలు లేవు, గ్రామ అభివృద్ధే నా ధ్యేయం, నేను సంపాదించుకోవడానికి రావడం లేదు నాకు ఎలాంటి కోరికలు లేవు గ్రామ ప్రజలకి సేవ చేయడమే నా కోరిక నా ఆశయం సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరపున బరిలో దిగుతున్నాను. గత 5 సంవత్సరాలుగా ఉప సర్పంచ్ గా గ్రామ అభివృద్ధికై పాటుపడుతూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేశాను. ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికై కృషి చేస్తూ రాబోవు ఐదు సంవత్సరాలు మండలంలోనే అరూర్ గ్రామాన్ని అభివృద్ధిలో మొదటి స్థానంలో నిలబెట్టాలని కృత నిశ్చయంతో ఉన్నాను.కావున మీ అందరి సహాయ సహకారాలు, మీ ఆశీర్వాదాలు మాపై ఉంచి మమ్మల్ని గ్రామపంచాయతీ సర్పంచ్ గా ఆశీర్వదించి,మీ అమూల్యమైన సపోర్టును నాకు అందిస్తారని ఆశిస్తున్నాను. మీ శ్రేయోభిలాషి సుక్క ముత్యాలు, గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో గ్రామ అభివృద్ధికై గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఎంతగానో కృషి చేశాను.గ్రామ సర్పంచ్ గా అధికారంలో ఉంటే గ్రామాన్ని ఇంకెంత అభివృద్ధి పథంలో నడిపిస్తానో ఒక్కసారి ఆలోచించండి. కాంగ్రెస్ పార్టీ గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా బరిలోదిగుతున్నాను, గ్రామ ప్రజలందరూ నాకు సపోర్టు చేసి అత్యధిక మెజార్టీతో గెలిపించగలరని కోరుచున్నాను.

## పెబ్బేరు చెక్‌పోస్ట్ ను తనిఖీ చేసిన ఎస్పీ సునీత రెడ్డి

**వనపర్తి, డిసెంబర్ 03(ప్రజాస్వరం):**

గ్రామపంచాయతి ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో జిల్లాలో భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని వనపర్తి జిల్లా ఎస్పీ సునీత రెడ్డి పోలీస్ అధికారులకు సూచించారు. బుధవారం ఆమె పెబ్బేరు చెక్‌పోస్ట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్ట్‌లో జరుగుతున్న వాహనాల తనిఖీలు, రిజిస్టర్ నమోదు, పోలీసు సిబ్బంది అప్రమత్తత, నిఘా చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఎన్నికల ప్రభావాన్ని దెబ్బతీసేలా నగదు, మద్యం, బంగారం వంటి అక్రమ రవాణా ఏదైనా చోటు చేసుకుంటే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ గట్టి హెచ్చరిక ఇచ్చారు. “ఎన్నికల భద్రత విషయంలో ఎటువంటి రాజీ ఉండదు. చట్టాన్ని అతిక్రమించే వారెవరైనా వెంటనే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం” అని ఎస్పీ స్పష్టం చేశారు. అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ సందర్శనలో వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు, పెబ్బేరు ఎస్సైలు యుగంధర్ రెడ్డి, దివ్యతో పాటు పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




## పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- **రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణీ కుముదిని**

**కరీంనగర్, డిసెంబర్ 03(ప్రజాస్వరం):**




రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకులు, పోలీస్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ, మొదటి, రెండవ విడత నామినేషన్ల స్వీకరణ, దాఖలైన నామినేషన్ల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండవ విడత నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని, మూడవ విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కూడా తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎన్నికల సిబ్బంది కేటాయింపు, పోస్టల్ బ్యాలెట్, బ్యాలెట్ బాక్సులు, శాంతిభద్రతలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ కాన్ఫరెన్స్ కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ మొదటి విడతలో 92 సర్పంచ్ స్థానాలకు 730 నామినేషన్లు, 866 వార్డు సభ్యుల స్థానాలకు 2174 నామినేషన్లు దాఖలు అయ్యాయని చెప్పారు. రెండో విడతలో 113 సర్పంచ్ స్థానాలకు 888, 1046 వార్డు సభ్యుల స్థానాలకు 3056 నామినేషన్లు దాఖలు అయినట్టు వెల్లడించారు. నామినేషన్ వేయని సర్పంచ్ లేదా వార్డు సభ్యుల స్థానాలు ఇప్పటివరకు లేవని తెలిపారు. 125 వార్డు స్థానాలకు ఒకే ఒక నామినేషన్ దాఖలు అయినట్లు వెల్లడించారు. 2946 పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించినట్లు తెలిపారు. జిల్లాలో మొదటి, రెండవ విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, మొదటి దశ నామినేషన్ల పరిశీలన కూడా నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా, మండల స్థాయిలలో అధికారులతో పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలకు పోలీస్ యంత్రాంగం సంసిద్ధంగా ఉందని తెలిపారు. 19 శాతం పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైన గుర్తించి పటిష్ట బందోబస్తుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న 635 మందిని బైండోవర్ చేశామని, 33 లైసెన్స్ తుపాకులను డిపాజిట్ చేసుకున్నామని వివరించారు. ఇప్పటివరకు 70 అక్రమ మద్యం కేసులు, ఎన్ డి పి ఎస్ చట్టం కేసు ఒకటి నమోదైనట్లు వెల్లడించారు. గ్రామ పోలీసు అధికారులను కేటాయించి క్షేత్రస్థాయిలో ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో కలెక్టర్, సిపితో పాటు అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఎన్నికల పరిశీలకులు వెంకటేశ్వర్లు, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.




# "జర్నలిస్టుల మహా ధర్నా విజయవంతం"

- **జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్**
- **రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన జర్నలిస్టులు**
- **నినాదాలతో హోరెత్తిన సమాచారశాఖ కమిషనర్ కార్యాలయం**
- **మహా ధర్నాలో పాల్గొన్న వయోదిక జర్నలిస్టుల సంక్షేమ సంఘం నాయకులు**

**హైదరాబాద్ డిసెంబర్ 03(ప్రజాస్వరం):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరవాలని, జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టియుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ డిమాండ్ చేశారు. బుధవారం టియుడబ్ల్యూజే ఐజేయూ ఆధ్వర్యంలో హైదరాబాద్, మాసబ్ ట్యాంక్ లోని సమాచార శాఖ కార్యాలయం వద్ద జరిగిన మహాధర్నా విజయవంతం అయిందని వారు పేర్కొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున జర్నలిస్టులు తరలివచ్చారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులంతా తరలివచ్చి ధర్నాలో పాల్గొన్నారని, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అయ్యిందని, అయినప్పటికీ కొత్త అక్రిడియేషన్ కార్డులు ఇవ్వడం లేదని, ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించడం లేదని హెల్త్ కార్డులను పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. దీనికి తోడు జర్నలిస్టులకు సంబంధించిన కమిటీలను వేయకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. జర్నలిస్టులను విస్మరించడం తగదన్నారు. గొంతెమ్మ కోరికలను జర్నలిస్టులు కోరడం లేదని గతంలో అమలు చేసిన వాటినే సంపూర్ణ స్థాయిలో అమలు చేయాలని అడగడం తప్పా? అని ప్రశ్నించారు. జర్నలిస్టుల్లో అనేకమంది పేద మధ్య తరగతి వర్గాల వారు ఉన్నారని వారంతా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇబ్బందులు పడుతున్న సంగతిని గుర్తించాలన్నారు ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరవాలని మహా ధర్నా ద్వారా వారు మేల్కొవాలని చెప్పారు. తక్షణమే హెల్త్ కార్డులను మంజూరు చేయాలని కొత్త అక్రిడేషన్ కార్డులను ఇవ్వాలని ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.




# హిందు గాళ్లు బొందు గాళ్లు అన్నోళ్లు కాలగర్భంలో కలిసిపోయారు !?

- **హిందూ వ్యతిరేకిగా మారిన సీఎం రేవంత్ రెడ్డి కూడా అదే గతి పడుతుంది.**
- **హిందూ దేవుళ్ళ గురించి హేళనగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి కి ఇతర మతాల గురించి మాట్లాడే దమ్ము ధైర్యం ఉందా..?**
- **ఇతర మతాల మెప్పుకోసం రేవంత్ రెడ్డి పాకులాడుతున్నారు.**
- **బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి.**

**కరీంనగర్, డిసెంబర్ 03(ప్రజాస్వరం):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయాలే పరమావధిగా జీవిస్తున్నారని, తన రాజకీయ అవసరాల కోసం ఇతర మతాల మెప్పుకోసం హిందూ దేవుళ్లను ద్వేషిస్తూ, హేళనగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి బేషరతుగా హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి డిమాండ్ చేశాడు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ వ్యతిరేక వ్యాఖ్యలపై బుధవారం రోజున బిజెపి జిల్లా శాఖ కరీంనగర్లోని తెలంగాణ చౌక్ లో నిరసన కార్యక్రమం చేపట్టింది.. ఇట్టి నిరసన కార్యక్రమంలో పాల్గొన్న గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి కేసీఆర్ హిందువులను చులకన చేసి మాట్లాడారని, హిందుగాళ్లు, బొందు గాళ్లని నాడు కెసిఆర్ చేసిన వ్యాఖ్యలకు కాలమే సమాధానం చెప్పిందన్నారు. కెసిఆర్ చేసిన వ్యాఖ్యలకు హిందూ సమాజం తగిన బుద్ధి చెప్పిందని, నేడు ఆ పార్టీ కాలగర్భంలో కలిసిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా కెసిఆర్ బాటలోనే నడుస్తున్నారని, అందుకే హిందూ సమాజం తో పెట్టుకుంటున్నారని ఘాటుగా విమర్శించారు. మూడు కోట్ల దేవతలంటూ ఒక్కో దేవుని పై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హిందూ ప్రజల మనోభావాలు దెబ్బ తీసేలా ఉన్నాయన్నారు. హిందూ దేవుళ్ళ గురించి వ్యాఖ్యలు చేసినట్టు ఇతర మతాల దేవుళ్ళ గురించి రేవంత్ రెడ్డికి మాట్లాడే దమ్ము ధైర్యం ఉందా అని ఆయన ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి హిందూ ద్వేషిగా మారారన్నారు. హిందూ దేవుళ్ళతో, హిందూ సమాజంతో పెట్టుకుంటున్న రేవంత్ రెడ్డి గత కెసిఆర్ లాగే కాలగర్భంలో కలిసిపోయే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ప్రోగ్రాం కు ముందు కొత్తపల్లి బిజెపి మండల అధ్యక్షుడు కుంట తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన ముఖ్య నేతల సమావేశంలో కూడా గంగాడి కృష్ణారెడ్డి పై వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిల రమేష్, వాసాల రమేష్, కళ్లెం వాసుదేవరెడ్డి, గువ్వల శ్రీనివాస్, కటకంలోకేష్, జోన్ ప్రెసిడెంట్, పాదం శివరాజ్, బండారు గాయత్రి, తణుకు సాయి కృష్ణ, అవదుర్తి శ్రీనివాస్ నరహరి లక్ష్మారెడ్డి, ఆవిడల చైతన్య, నాంపల్లి శ్రీనివాస్, ప్రసన్న, యువ క్రాంతి, అక్షయ్, కట్ట రాజు, ప్రసాద్, బోయిన్ శ్రీను, జి రవి, అనిష్,పాశం తిరుపతి, ఆకుల నరేష్, అజయ్, వెంకటేష్, సందీప్, శ్రీధర్, అనిల్, విజయ్, కలికోట మోహన్, నారాయణ, జిత్తు, నవీన్, మరియు తదితరులు పాల్గొన్నారు.





# దివ్యాంగులకు అండగా ఉంటాం

- **ఉన్నత చదువులు చదివేలా సౌకర్యాలు కల్పించి ప్రోత్సహిస్తాం**
- **ఐదు శాతం ఇందిరమ్మ ఇళ్ళను కేటాయిస్తాం**
- **ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**కరీంనగర్, డిసెంబర్ 03(ప్రజాస్వరం)**

దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని.. వారు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించేలా సహాయ సహకారాలు అందిస్తామని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం శాతవాహన యూనివర్సిటీ సమీపంలో ఉన్న ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితోపాటు మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనితా రామచంద్రన్, వయోవృద్ధుల దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. దివ్యాంగులైన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. బధిరుల ఆశ్రమ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని బదిరుల ఆశ్రమ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని.. నిపుణులైన అధ్యాపకులను నియమించి సైన్ లాంగ్వేజ్ ద్వారా తరగతులు బోధిస్తామని వివరించారు. దివ్యాంగులు తమలోని దివ్య దృష్టిని వృధా చేయవద్దని.. ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించాలని సూచించారు. అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు ఇందిరమ్మ ఇళ్ళ మంజూరులో ఐదు శాతం దివ్యాంగులకు కేటాయించేలా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఆర్టీసీ బస్సు పాసుల సమస్య కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. దివ్యాంగులు ఉంటున్న పాఠశాలల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమను సంప్రదించాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ కి సూచించారు. వచ్చే ఏడాది (దివ్యాంగుల దినోత్సవం) కల్లా దివ్యాంగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దివ్య దృష్టి యూట్యూబ్ ఛానల్ ను ఆవిష్కరించారు. కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో దివ్యాంగులు పాడిన పాటను సీఎం ఆవిష్కరించినట్లు అతిథులు వివరించారు. దివ్యాంగుల శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనిత రామచంద్రన్ మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న దివ్యాంగులలో అద్భుత ప్రతిభ ఉంటుందని వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని పేర్కొన్నారు. సైన్ లాంగ్వేజ్ లో జనగణమన పాడిన కలెక్టర్ బృందాన్ని అభినందించారు. స్కిల్ ట్రైనింగ్ ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. యూపీఎస్సీ వంటి ఉన్నత ఉద్యోగాల్లో దివ్యాంగులు రాణిస్తున్నారని.. చదువును నమ్ముకుని ముందుకు సాగాలని సూచించారు. వయో వృద్ధుల దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ మాట్లాడుతూ మన రాష్ట్రంలో దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యం పెంచుకోవాలని సూచించారు. దివ్యాంగుల సంక్షేమం కోసం కలెక్టర్ చేపడుతున్న చర్యలను అభినందించారు. దివ్యాంగుల కోపరేటివ్ చైర్మన్ వీరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులతో ఇప్పటికీ స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. 40 శాతం వైకల్యం ఉన్న పరికరాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. జిల్లాలోని డిసిబిసి భవన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. అనంతరం అతిథులను అధికారులు, సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. సందర్భంగా దివ్యాంగులైన విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, మెప్మా పీడీ స్వరూప రాణి, అధికారులు, వికలాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

**బాలుడి కుటుంబానికి అండగా ఉంటాం**

హైదరాబాదులో వీధి కుక్కల దాడిలో గాయపడ్డ బాలుడి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని మంత్రి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. అతని కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, మా శాఖ ద్వారా మెరుగైన వైద్య సేవలు, అది చదువు బాధ్యతలు చూస్తామని హామీ ఇచ్చారు.




# విధులకు ఎగనామం పెడుతున్న షాబాద్ బీసీ హాస్టల్ వార్డెన్ పిఆర్ జ్యోతి

**రంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 03(ప్రజాస్వరం):**

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని బీసీ హాస్టల్ వసతి గృహంలో పనిచేస్తున్న వార్డెన్ పిఆర్ జ్యోతి గత వారం రోజుల నుండి విధులకు ఎగనామం పెట్టి ఏదో పై ఆఫీసులో పని ఉందని చెప్పి వెళ్ళిపోతుందని క్రింది సిబ్బంది బుధవారం విలేఖరికి వివరించారు. ప్రజాక్షేత్రం విలేకరి గత వారం రోజుల నుండి హాస్టల్ తనిఖీ చేయగా ఏ ఒక్కనాడు కూడా విలేఖరి కంటపడలేదు ఎప్పుడు చూసినా క్రింది స్థాయి సిబ్బంది వచ్చి వార్డెన్ ఎక్కడ వెళ్లారంటే, ఇప్పుడే పై ఆఫీస్ పని మీద వెళ్లిపోయిందని కిందిస్థాయి సిబ్బంది విలేకరికి చెప్పారు. అసలు ప్రభుత్వ అధికారులు హాస్టల్లో తనిఖీలు చేయకపోవడం వలన ఈ వసతి గృహాల్లో పనిచేస్తున్న వార్డెన్లు ఆడింది ఆట పాడింది పాట అనే చెందగా మారింది పై అధికారులు తనిఖీలు నిర్వహిస్తుంటే వార్డెన్ డ్యూటీలు సక్రమంగా నిర్వహిస్తారని హాస్టల ముందు ఉన్నటువంటి ప్రజలు నేరుగా బుధవారం విలేఖరికి వివరించారు. ఎప్పుడు వస్తుందో తమకే తెలియదని కానీ హాస్టల్లో పనిచేసే క్రింది స్థాయి సిబ్బంది మాత్రం ఉంటారని వారు మాత్రం మాకు, తెలుసునని వారానికి సరిపడా బియ్యం, పప్పులు ధాన్యాలు ఇచ్చి తమకు పై ఆఫీసులో



పని ఉందని చెప్పి వార్డెన్ వెళ్లిపోయి తిరిగి వారం రోజుల్లో 15 రోజులు హాస్టల్కు దర్శనమిస్తుంది. అని విద్యార్థుల తల్లిదండ్రులు మరోవంక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పర్యవేక్షణ లోపించడం మళ్ళీ విధులకు ఎగనామం పెడుతూ తమ పిల్లల జీవితాలతో చెలగాటమాడుతున్న ఈ వార్డెన్ ను వెంటనే బదిలీ చేయాలని షాబాద్ వసతి గృహం పక్కన ఉన్నటువంటి గ్రామస్తులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల బాగోగులు చూడని ఈ వార్డెన్ తమకుఎందుకని ఆయా గ్రామాల పిల్లల తల్లిదండ్రులు పై అధికారులు వేడుకుంటున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- **తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి**

**రంగారెడ్డి నవంబర్ 03(ప్రజాస్వం):**

బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రస్తుతం ఇస్తున్న పింఛన్‌లను పెంచుతామని ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెన్షన్ల పెంపు అంశం విస్మరించారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి అయనా పింఛన్ పెంపు లేకపోగా.. ఉన్న పింఛన్‌లు ఎప్పుడు వస్తున్నాయో తెలియని పరిస్థితి నెల కొంది. దివ్యాంగులకు పింఛన్ పెంపు అమలు చేయకుండా ముఖ్యమంత్రి దగా చేస్తున్నాడని తెలిపారు. మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం దివ్యాంగులకు తక్షణమే రూ.6వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించే పెన్షన్ పథకాలు కేవలం రాజకీయ వాగ్దానాలకే పరిమితం కాకుండా, నిత్యజీవనంలో అవసరమైన మద్దతు కావాలని వారికి అండగా నిలవాలని స్పష్టం చేశారు. కాంగ్రెస్ సర్కార్ వికలాంగ సమాజంపై చిన్నచూపు చూస్తుందన్నారు. వారి సమస్యలపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని అని అన్నారు. ఆధునిక ఉపకరణాల పంపిణీ, ప్రత్యేక ఉపాధి కోటా వంటి హామీలు గాలిలో కలిశాయని ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగులు సమాన హక్కులు, గౌరవం, అవకాశాలు పొందేలా ప్రజా ప్రభుత్వం వెంటనే స్పందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో పింఛన్ పెంపుపై ఇచ్చిన హామీనీ ఇప్పటికైనా వెంటనే అమలు చేయాలని పాండురంగారెడ్డి డిమాండ్ చేశారు.





# రాంపల్లి డబుల్ బెడ్రూం కాలనీలో ప్రభుత్వ పాఠశాల ప్రారంభం

- **పేద, మధ్యతరగతి పిల్లలకు ప్రభుత్వ బడుల్లోనే మంచి విద్య: జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్త**

**మేడ్చల్ మల్కాజిగిరి(ప్రజాస్వరం):**

పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుతుందని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్త చెప్పారు. కీసర మండల పరిధిలోని రాంపల్లి గ్రామంలోని డబుల్ బెడ్రూం కాలనీలో ఏర్పాటు చేసిన కొత్త ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంగళవారం జిల్లా విద్యాధికారిణి విజయకుమారితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి, కీసర మండల విద్యాధికారి జమదగ్ని, కీసర-చీర్యాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాంరెడ్డి, రవీందర్, కాలనీలోని 52 బ్లాకుల అధ్యక్షులు పాల్గొన్నారు. కాలనీ షాపింగ్ సముదాయంలో కేటాయించిన మూడు మందిరాల్లో మొదటి తరగతి నుంచి ఐదో తరగతి వరకు బోధన ప్రారంభించినట్లు ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తెలిపారు. జిల్లా కార్యాలయ అధికారి అయ్యన్న వసతులు, మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించారు. కాలనీ వాసులతో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ— "ఈ ప్రాంతంలో ఒక కిలోమీటరు పరిధిలో ప్రభుత్వం నిర్వహించే బడి లేకపోవడంతో విద్యా హక్కు చట్టం ప్రకారం ఈ బడిని ఏర్పాటు చేశాం. త్వరలోనే దాతల సహకారంతో కొత్త భవన నిర్మాణాన్ని ప్రారంభిస్తాం" అన్నారు. బడి-గుడి అభివృద్ధిలో రాజకీయాలకు చోటివ్వకుండా అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ బడుల్లోనే మంచి విద్య అందుతున్నందున ప్రైవేటు బడులకు పంపకుండా ఈ బడిలోనే పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.


EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999